# ఉదయం నుంచీ వాన!

ఉదయం నుంచీ వాన!

లచ్చికి గుండె గుబులు గుబులుగా ఉంది. వాన అంతకంతకూ ఎక్కువయే సూచనలే తప్ప, తగ్గు ముఖం పట్టేలా కనిపించడం లేదు. డబ్బు లేక, యీ ఏడాది పాక నేయించ లేదు. చూరు జారి పోయి, వెన్ను వంగి పోయి, పడి పోయేలా ఉంది. మట్టి గోడ పెచ్చులూడి పోతోంది. దానికి తోడు యీ వర్షమొకటి. ఇల్లంతా కారిపోతోంది. బట్టలన్నీ తడిసి ముద్దయి పోయాయి. పెరటి వేపు పల్లం జాగా లోంచి, వర్షం నీళ్లు ఇంట్లోకి చొచ్చుకు వచ్చేస్తున్నాయి. వాటిని సిల్వరు తపేలాతో బయటికి ఎత్తి పోస్తోంది లచ్చి.

"అమ్మా యియ్యేల పన్లోకి ఎల్లవా?" అడుగు తోంది, ఆరేళ్ళ నాగరత్నం. "ఎల్తానమ్మా, యీ దిక్కు మాలిన వొర్సం వొదిల్తేనా!" అంటూ నిట్టూర్చింది. ఇంట్లో అగ్గి రాజెయ్యడానికి గింజలు కూడా లేవు. పొడి జాగా లేదు. "ఏంబతుకులో, ఏవో!" బాధగా అనుకుంది లచ్చి. ఇవాళ పనిలోకి వేగిరం రమ్మని జయమ్మ మరీ మరీ చెప్పింది. ఇవాళ వాళ్ళ పాప బేబీ పుట్టిన రోజు. సాయంత్రం అందరూ వస్తారు. పార్టీ అదీ ఉంది. ఆపాప పుట్టిన రోజు పండుగలు జయమ్మ గారూ వాళ్ళు – ఎంతో ఘనంగా చేస్తూ వుంటారు. సరిగ్గా వాళ్ళ బేబీ పుట్టిన రోజునే నాగరత్నం కూడా పుట్టింది. దీని పుట్టిన రోజు కూడా యివాళే. పుట్టిన రోజు పండుగలూ, ఆ వేడుకలూ అన్నీ కలిగిన వాళ్ళకే కాని తమలాంటి వారికి ఎలా కుదురుతాయి? లచ్చికి కళ్ళలో గిర్రున నీళ్ళు తిరిగాయి. "కనీసం దాని అయ్య బతికుండినా ఇయ్యేల దానికో గుడ్డ ముక్కయినా కొనుండేవాడు. ఆ అదృష్టం కూడా ఆపిల్లకి లేదు. చింపిరి జుట్టుతో, చిరిగిన గౌనుతో – ఏ సరదా తీరకుండా దీని బతుకింతే కాబోలు!... తనలాంటి దాని కడుపున పుట్టి ఏం బావు కుంటుంది! పెద్దోళ్ళ బిడ్డగా పుడితే ఎంత గొప్పగా పెరిగి ఉండేది! ఇవాళ జయమ్మ గారి బేబీని చూడడానికి రెండు కళ్ళూ చాలవు.

మెడలో బంగారం గొలుసులతో, తలంటు పోసుకున్న జుత్తు సుతారంగా మీదకి ఎగ దోసుకుంటూ రెప రెపలాడే కొత్త బట్టలతో – నవ్వుతూ, సరదాగా ఆడుతూ పాడుతూ ఉంటుంది. పుట్టిన రోజు పార్టీ ఎంతో గొప్పగా చేస్తారు. ఎవరెవరో కార్ల మీద వస్తారు. ఏవేవో బహుమతులు తెస్తారు. తనకీ రోజు ఊపిరి సలపనంత పని ఉంటుంది. బేబి కొవ్వొత్తుల్ని ఆర్పి, కేక్ కోస్తుంది. అంతా చప్పట్లు కొడతారు. అందరికీ బేబీ అంటే ముద్దే. అంతా బేబీని మెచ్చుకుంటూ ఉంటే, జయమ్మ గారి ముఖం ఆనందంతో వెలిగి పోతూ ఉంటుంది.

కాని, తన బిడ్డ నాగరత్నం మాత్రం పుట్టిన రోజు నాడు ఎలాంటి సరదాలకీ నోచుకోదు. చివరికి కొత్త గౌను కూడా కొనలేక పోయింది తను. ఈ మధ్య తను మంచాన పడి పోవడంతో మందులకీ వాటికీ చాలా ఖర్చయి పోయింది. జయమ్మని అడిగి, జీతం డబ్బులు ముందుగా తీసుకొని, ఖర్చు పెట్టాల్సి వచ్చింది. ఇంక దీనికేం గుడ్డ ముక్క కొంటుంది! కనీసం దీనికి యీ రోజన్నా కడుపు నిండా కూడు పెట్టగలదా! తను ఏడుస్తున్నట్టుగా లచ్చికే తెలియదు. కళ్ళ వెంట నీళ్ళు ధారగా కారి పోతూ చెంపలని తడిపేసాయి. "అమ్మా, ఏడుస్తున్నా వెందుకే?" నాగరత్నం భయం భయంగా అడుగుతోంది. ఉలికి పడి చూసింది లచ్చి. కన్నీళ్ళు తుడుచుకుంది. "లేదమ్మా! ఇయ్యేల నీ పుట్టిన రోజు కదా జయమ్మ గారింటి నుంచి సాయంత్రం వచ్చేటప్పుడు నీకు బువ్వతో పాటు తీపి తీపి మిఠాయిలూ, అవీ తెస్తాను, తెలుసా!..." అంది నవ్వడానికి ప్రయత్నిస్తూ. అయితే ఏడవడం ఎందుకని ఆ పిల్ల అడగ లేదు. "మిఠాయిలే! అబ్బ! అన్నీ నాకే యివ్వాల!" సంతోషంతో నాగరత్నం ముఖం వెలిగి పోతోంది.

ఆ పిల్లని చూసి – ఏడవాలో, జాలి పడాలో తెలీక బాధగా నిట్టూర్చింది లచ్చి. "మద్దినేల పన్లోంచి వచ్చేటప్పుడు కోమిటోడి కొట్టునుంచి సీకాయ పొడి పేకట్టు తెచ్చి, దీనికి నీళ్ళు పోసి తలంటాలి!" అనుకుందామె. మరో అర గంటకి వాన తగ్గింది. లచ్చి పన్లోకి బయలు దేరింది.

* * *

ఉదయం నుంచీ వాన!

జయకి గుండె గుబులుగా ఉంది. వాన తగ్గి నట్టే తగ్గి, మళ్ళీ మొదలయింది. అంతకంతకూ ఎక్కువ అవుతోందే కాని, తగ్గే సూచన కనబడడం లేదు. ఇంకా ఎక్కడి పనులు అక్కడే ఉన్నాయి. పార్టీకి అందరికీ ఫోన్లు చెయ్యడం జరిగింది. చాలా మంది వస్తారు. గ్రాండ్‌గా పార్టీ చేదామనుకుంటే ఈ దరిద్రగొట్టు వానొకటి. ఇల్లు పెద్దదే. ఎంత మంది వచ్చినా, యిబ్బంది లేకుండా ఉండొచ్చు. బయట ఎంత కుండపోతగా వర్షం పడుతున్నా, పొడిగా, వెచ్చగా కార్యక్రమం జరిపించు కోవచ్చు. పాపం, వచ్చే వాళ్ళకే యిబ్బంది. కార్లలో వస్తారు. అయినా వర్షం వల్ల చికాకే కదా! పార్టీ సాయంత్రం. పదార్థాలన్నీ హొటలు వాళ్ళు ఆరింటికి తెచ్చి అమరుస్తారు. దాని గురించి చింత లేదు. కాని, ఈ లోగా యిల్లంతా చిందర వందరగా ఉంది. లచ్చి యింకా పన్లోకి రాలేదు. దాంతో మనసంతా చిరాగ్గా ఉంది. ఏం చెయ్యడానికీ కాళ్ళూ చేతులూ ఆడడం లేదు. ఈ ముండ యివాళే రావడం మానేస్తుందేమిటో, ఖర్మ! ఇవాళే దాని కూతురు పుట్టిన రోజు కూడానుట! దానికింక అలంకారాలు చేస్తూ కూచుంది కాబోలు! తినడానికి మెతుకులుండవు కానీ, ఆర్భాటాలకేమీ లోటుండదు, దానికి పుట్టిన రోజు వేడుకలు చేస్తూ కూచుందేమో! ఛ! ఛ! ఈ అలగా జనం వాళ్ళింతే! మారరు గాక మారరు! దీన్ని నమ్ముకుని కూచుంటే యివాళ పార్టీ బాగానే అయేట్టుగా ఉంది. ఈ చికాకులతో పాటు – ఉదయం నుంచీ వాన! ఇవాళే కురవాలా!" అని, రుస రుసలాడి పోతోంది.

"ఏమిటి మమ్మీ, ఎవరి మీద కోపంగా ఉన్నావు?" అడుగుతోంది బేబి. "లేటుగా నిద్ర లేచానని నామీదే కదూ?" అడిగింది అమాయకంగా ముఖం పెట్టి. జయలో ఓ క్షణ కాలం చికాకు మాయమై చిరు నవ్వు చోటు చేసుకుంది. "నో, బేబీ!... యూ ఆర్ వెరీ వెరీ గుడ్ గాళ్! నువ్వు రోజూ కంటె లేపగానే ముందుగా లేచావు కదా! ఆ డర్టీ క్రీచర్, లచ్చి ఇంకా పని లోకి రాలేదు... బోలెడు పనులున్నాయి. అందులోనూ యివాళ మా బంగారు కొండ పుట్టిన రోజు కూడానూ!" అంటూ బేబి బుగ్గమీద చిటికె వేసింది. బేబి కిల కిలా నవ్వింది. "పద బేబీ, షాంపూతో తలంటు పోసుకుందువు గాని" అంటూ కూతుర్ని తొందర పెట్టింది. బేబీకి తలంటు స్నానం చేయించి, కొత్త డ్రస్ వేసే వేళకి వర్షం కొంచెం తెరిపి యిచ్చింది. లచ్చి కూడా వచ్చింది. "మై గుడ్‌నెస్..." జయ ఇంగ్లీషులో సంతోషించింది.

ఎందుకేనా మంచిదనుకుందో, ఏమో, లచ్చిని పెద్దగా ఏమీ అన లేదు. వర్షం మాత్రం దోబూచులాడుతోంది. వస్తోంది; తగ్గుతోంది. కొంచెం తగ్గి నప్పుడల్లా, జయ 'హమ్మయ్య!' అనుకుంటోంది. మళ్ళీ మొదలయ్యే సరికి 'దిక్కుమాలిన వాన!" అని విసుక్కు పోతూ తిట్టు కుంటోంది.

ఉదయం పనయ్యేక ఓ సారి యింటికెళ్ళి రావడం లచ్చికి అలవాటు. మధ్యాహ్నం మిగిలిన వాటిలో జయమ్మ ఏదేనా యిస్తే యింటికి తీసికెళ్ళడం. కూతురి తిండి తిప్పలు చూసుకుని, తనింత తిని, మళ్ళీ రావడం ఆమెకి అలవాటు: కానీ, ఈ రోజు లచ్చిని జయ వదల్లేదు. పంపిస్తే తిరిగి రాదని ఆమె భయం! ఇవాళ దాని కూతురి పుట్టిన రోజు కావడం చేత రావడం మానేసినా మానేస్తుంది. అంత దొంగముండ అది! అంచేత తెలివిగా, "ఒసే, లచ్చీ, ఇవాళ యింకేం యింటికెళ్తావే, ఉండిపో, ఇక్కడే ఏదో తిందువు గాని ఈ ఒక్క రోజు నాకు సాయంగా ఉండాలి! నాకసలే కాళ్ళూ చేతులూ ఆడడం లేదు... సాయంత్రం పార్టీ అయ్యేక, ఏకంగా వెళ్దువు గాని... మిగిలినవన్నీపెడతాను; ఇంటికి పట్టు కెళ్దువులే... అన్నట్టు – యివాళ నీ కూతురి పుట్టిన రోజు కూడా కదూ? వెళ్ళేటప్పుడు అడగడం మరిచి పోయేవు సుమా!" అంది. లచ్చికి ఏం చెప్పాలో తెలీ లేదు. ఉదయం ఇంటి నుంచి వచ్చేటప్పుడు యింత అన్నం, రెండు పిండొడేలు తపేలాలో పెట్టి ఉట్టి మీద పెట్టి వచ్చింది. నాగరత్నం తిందో, లేదో. అప్పుడప్పుడు ఇంకేవో పనులు తగిలి మధ్యాహ్నాలు కొంపకి వెళ్ళక పోవడం అలవాటే. ఇంట్లో ఉన్న దేదో తిని, సాయంత్రం తన రాక కోసం ఎదురు చూస్తూ ఉంటుంది నాగరత్నం. అయితే – ఇవేళ దాని పుట్టిన రోజు! వేగిరం వెళ్ళాలనిపిస్తోంది. కాని జయమ్మ జాలిగా ముఖం పెట్టి అడుగుతూ ఉండడంతో కాదన లేని పరిస్థితి. బాబు గారు కూడా చెప్పడంతో మరింక మాట్లాడ లేక పోయింది. పైగా, ఉదయం నుంచీ వాన!... అడుగు తీసిబయటికి వెళ్ళ లేని పరిస్థితి! వంచిన నడుం ఎత్తకుండా సాయంత్రం వరకూ పని చేస్తూనే ఉంది లచ్చి. ఓ ప్రక్క పార్టీ కోసం బాబు గారు మరో యిద్దరి సాయంతో గదంతా చక్కగా అలంకరించేరు.

చిత్రం!

సాయంత్ర మవుతూనే వర్షం తగ్గింది! జయ, బాబు గార్ల ఆనందానికి అవధుల్లేవు! "నేను చెప్ప లేదూ! మన బేబీ అదృష్టవంతురాలు! పార్టీకి ఏ ఆటంకం ఉండదని, అంతా

సవ్యంగా జరుగుతుందని నాకు తెలుసు!..." బాబు గారు జయమ్మతో సంబరంగా చెప్తూ ఉండడం విని, లచ్చి "అవును కదా. బేబీ తల్లి, మా మంచి అదురుష్ట వంతురాలు!" అనుకుంది మనసులో. బేబీ పుట్టిన రోజు ఫంక్షను ఘనంగా జరిగింది. ఎక్కడా వర్షాటంకం లేదు. ఉదయం నుంచీ కురిసిన వాన ఎటు పోయిందో! జయమ్మ వాళ్ళు ఎంత భయ పడ్డారో, వెధవ వాన! అని ఉదయం నుండీ ఆ తల్లి విసుక్కుంటూనే ఉంది. ఇప్పుడొక్క చినుకు లేదు! దేవుడు కూడా పెద్దోళ్ళ మొరని దయతో పట్టించు కుంటాడు కాబోలు!

ఆ వేడుక చూస్తూ ఉంటే, లచ్చికి మనసంతా అదోలా దిగులుగా, బాధగా తయారయింది. ఏదో వెలితి ఆమె మనసుని దహించి వేస్తోంది. యాంత్రికంగా అ పనీ యీ పనీ చేసుకు పోతోంది, మధ్యలో జయమ్మ విసుక్కుంటూ పెట్టే కేకలు మౌనంగా భరిస్తోంది. లచ్చికి బేబీని చూస్తూ ఉంటే నాగరత్నమే కళ్ళ ముందు మెదులుతోంది. తిండి తిందో, లేదో. వర్షానికి యిల్లంతా నాని పోయి ఉంది. వెర్రి తల్లి, ఎలా ఉందో! తను అన్నం, లడ్డూలు తెస్తానని ఆకలితో ఒళ్ళంతా కళ్ళు చేసుకుని ఎదురు తెన్నులు చూస్తూ ఉంటుంది. పాపం! ఈ పార్టీ చూస్తే తొమ్మిదింటికి కానీ పూర్తయేలా లేదు. చూసి చూసి విసిగి పోయి - "అమ్మ యింతే! అన్నీ అబద్ధాలే. ఏం తేదు!" అనుకుని కుక్కి నుంచం మీద పడుకుని నిద్ర లోకి వొరిగి పోతుంది కాబోలు! ఛీ! ఏం జన్మ తనది! బిడ్డకి పుట్టిన రోజు నాడయినా కడుపు నిండా యింత అన్నం పెట్టుకో లేక పోయింది. ఉదయం వర్షానికి ఇంట్లో ఉన్న కాసిన్ని గుడ్డలూ తడిసి పోయేయి. ఇంకా ఆరేయో, లేదో. ఆ తడి గౌను ఎప్పుడు ఆరుతుందా అని చూస్తూ వొంటి మీద గుడ్డల్లేకుండా చెడ్డీతో కూచుని చూస్తూ వుంటుంది... లచ్చికి దు:ఖం తన్నుకొస్తోంది. తొమ్మిది కావస్తోంది. పార్టీ పూర్తయి నట్టే. అందరూ బేబీని మరీ మరీ ముద్దులాడుతూ యిళ్ళకి వెళ్ళి పోయేరు. ఇంక వచ్చే వాళ్ళు ఎవరూ లేరని జయమ్మ చెబుతోంది. ఇక తను యింటికి బయలు దేర వచ్చు! అనుకుంది లచ్చి. జయమ్మకి చెప్పి, ఆమె ఇచ్చే తినుబండారాలు తీసుకెళ్దామని ఆశతో అనుకుంటూ ఉండగా జయమ్మ "లచ్చీ, ఇవన్నీ లోపల గదిలో పెట్టు..." అంటూ పెద్ద బాస్కెట్ నిండా బేబీకి వచ్చిన పుట్టిన రోజు కానుకలు చూపించింది.

అవి అందుకుని లోపలి గది లోకి వెళ్ళింది లచ్చి. అవన్నీ చూసి, ఆమె కళ్ళు ఆశ్చర్యంతో విప్పారాయి. అబ్బ! ఎన్ని ఉన్నాయో! ఎన్ని రకాల ఆట వస్తువులు! ఎన్ని అందమయిన గౌన్లు! "గొప్ప వాళ్ళు ఏం చేసినా గొప్ప గానే చేస్తారు!" అనుకుంది ఒక్కొక్క పేకెట్టునీ తీసి, ప్రక్కనే ఉన్న టేబీలు మీద సర్దుతూ ఉంటే, లచ్చికి మనసులో ఓ ఆలోచన తళుక్కున మెరిసింది. అంత లోనే - తన కొచ్చిన ఆలోచనని తలచుకుని, ఆమె నిలువునా వణికి పోయింది. కాని, కొంత మానసిక ఘర్షణ చెలరేగాక... ఆమె మనస్సు పెట్టిన ఒత్తిడులకి లొంగి పోయింది! అన్ని గౌన్లలో ఒక్కటి.. ఒక్కటంటే ఒక్కటి... తన బిడ్డ కోసం తీసుకుంటే!... ఎవరికి తెలుస్తుంది! జయమ్మ యింటికి తీసికెళ్ళమని, అన్నం, తీపి వస్తువులూ యిస్తుంది తప్ప - నోరు విడిచి అడిగినా వీటి లోంచి ఒక్క గౌను తీసికెళ్ళ మని అంటుందా? మరీ దేబిరిస్తే బేబీ వాడేసిన ఏ పాత గౌనో యిస్తుంది తప్ప! లచ్చి

ఇప్పుడు మంచి చెడ్డలు బేరీజు వేసే స్థితిలో లేదు. తను చేస్తున్న పని తప్పని తెలిసినా ఆమె నిగ్రహించుకో లేక పోయింది. ఆమెకి తన బిడ్డ దైన్యం గుర్తొచ్చి, మనసు ఉగ్గబట్ట లేక పోయింది. ఎవరూ చూడడం లేదని నిశ్చయించు కున్నాక - వణుకుతున్న చేతులతో ఓ ఫ్రాక్ తీసి మడత పెట్టి, చీరలో యిముడ్చుకుని దాచేసింది. అంత లోనే ఆమెకి తను ఎంత హీనమయిన పని చేస్తోందో గ్రహింపుకొచ్చింది. ఎప్పుడూ యిలాంటి పని తను చేసి ఎరుగదు... ఇవాళ యింత దిగజారి పోయిందేం తను! లచ్చికి తన మీద తనకే అసహ్యం కలుగుతోంది. వెంటనే ఆ ఫ్రాక్ చీర మడతల్లోంచి తీసి టేబిలు మీద పెడదామని సిద్ధ పడింది. ఆమె తను చేసిన తప్పు సరిదిద్దుకునే వ్యవధి కూడా లేక పోయింది, జయ అటు వేపు వస్తున్న అలికిడి కావడంతో. లచ్చి చేసేది లేక - నిస్సత్తువుగా చూస్తూ ఉండి పోయింది.

* * *

లచ్చికి కాళ్ళు సన్నగా వణుకుతున్నాయి. మెదడంతా బద్దలయి పోతున్నట్టుగా ఉంది. భయంతో, సిగ్గుతో, తను చేసిన పనికి తన మీద తనకే రోతతో ఆమె కుంచించుకు పోతోంది. అక్కడ నుండి ఎంత వేగంగా బయట పడదామా అని, తొందర పడుతోంది. "వెళొస్తానమ్మా!" అని, జయమ్మకి చెప్పి, బయలు దేరబోతూ - అప్పుడు గమనించింది - మళ్ళీ కురుస్తోంది, కుండపోతగా వర్షం! ఎప్పుడు మొదలయిందో!

"ఇంత వర్షంలో ఎలా వెళ్తావే. కాసేపాగి, తగ్గేక వెళ్దువుగానిలే..." కసురుతున్నట్టుగా అంది జయ. లచ్చి నీరసంగా వరండాలో గోడకి చేరబడి కూచుండి పోయింది. బలంగా వీస్తున్న గాలి. సన్నని నీటి తుంపరలో ఆమె మీదకి ఉండుండి జల్లు పడుతోంది. కొంచెం కొంచెంగా తడుస్తోందామె. వొదిగొదిగి కూచుంటోంది. వర్షం పడుతూనే ఉంది. లోపలి గదిలో జయమ్మ, బాబు గారు, బేబీల మాటలు అక్కడికి పెద్దగా వినిపిస్తున్నాయి. పార్టీ గురించే మాట్లాడు కుంటున్నారు. వాళ్ళ మాటల్లో గొప్ప సంతృప్తి, ఆనందం వ్యక్త మౌతున్నాయి. లచ్చి కొంచెం వొంగి గది లోపలకి ఆసక్తిగా చూసింది.

లోపల - జయమ్మ బాగా అలిసి పోయినట్టు కనిపిస్తున్నప్పటికీ, ఆమె ముఖం సంతోషంతో వెలిగి పోతోంది. హాయిగా ఫోం బెడ్ మీద పడుకుని ఉంది. ఆమె వొళ్ళో గారాలు పోతూ, బేబి! ఫేను గిరగిరా తిరుగుతోంది. చల్లని ట్యూబు లైటు కాంతి గదంతా పరుచుకుని ఉంది. బాబు గారు ఆమె ప్రక్కనే సోఫాలో కూచుని ఉన్నారు. మంచం మీద తన కొచ్చిన పుట్టిన రోజు కానుకలని కుప్పగా పోసి, ఒక్కొక్క దానినే చూసి, మురిసి పోతోంది బేబి. వాళ్ళ కబుర్లు వింటూ ఉంటే లచ్చికి గుండెలో దిగులేదో చిక్కని చీకటిలా అలుముకుంది. బేలగా అటు వేపు చూస్తూ కూచుంది. కాస్సేపటికి కొత్త బట్టలతోనే తల్లి గుండెల మీద తల పెట్టుకుని, కల వారి బిడ్డకి వుండే అందమైన కళతో నిశ్చింతగా నిద్ర లోకి జారుకుంది ఆ పిల్ల. లచ్చికి మరక్కడ ఉండాలని పించడం లేదు. బయటికి చూసింది. వర్షం కొంచెం తగ్గినట్టుగా ఉంది. చిన్న చిన్న చినుకులు పడుతున్నాయి. ఇలాంటప్పుడే యిల్లు చేరుకోవాలి.

'వెళ్ళొస్తానమ్మా. జయమ్మా!' అంటూ లేచి, ఆశగా గది గుమ్మం దగ్గర నిల్చుంది. "ఊ.." మత్తుగా మూలిగింది జయ. లచ్చికి గుండె ఝల్లుమంది! వెళ్ళేటప్పుడు గుర్తు చేస్తే అన్నం,సేమ్యా, మిఠాయిలూ అన్నీ యిస్తానని చెప్పింది జయమ్మ! "అమ్మ గారూ..." ఆమెకు తన ఉనికిని గుర్తు చేయాలనే ఆరాటంతో మరోసారి పిలిచింది లచ్చి.

జయ బరువుగా కళ్ళు తెరిచింది. 'వెళ్ళి రావే, లచ్చీ, బాగా అలసటగా ఉందే – ఇప్పుడు లేచే వోపిక లేదు... రేపు ఉదయం స్వీట్లూ అవీ పెడతానుతే... వెళ్ళేటప్పుడు బాబు గారితో చెప్పి వెళ్ళు, తలుపులు వేసుకుంటారు..." అనేసి కళ్ళు మూసుకుని, బేబీని మరింత దగ్గరకి తీసుకుంది జయ. చెదిరిన మనసుతో దుఃఖ భారంతో వివర్ణమైన ముఖంతో యింటికి బయలు దేరింది లచ్చి.

* * *

లచ్చి తలుపు తోసి లోపలికి ప్రవేశించే సరికి "అమ్మా! వచ్చేవే..." అంటూ లేచి కూచుంది నాగరత్నం. అంత రాత్రయినా నిద్రపోకుండా తన రాక కోసం గంపెడాశతో ఎదురు చూస్తున్న కూతుర్ని చూసి, దుఃఖం ఆగ లేదు లచ్చికి. వెళ్ళి ఆర్తిగా కూతుర్ని పొదివి పట్టుకుంది.

లచ్చికి వెంటనే తను , జయమ్మ గారింటి నుంచి తెచ్చిన గౌను సంగతి గుర్తొచ్చింది. ముఖం విప్పారింది. "కొత్త గౌను చూపిస్తే పిచ్చి తల్లి! ఎంత మురిసిపోతుందో!" అనుకుంటూ, "నాగూ! నీకేం తెచ్చానో చూడూ..." అని, గౌను తీసి మురిసిపోతూ కూతురికి చూపించింది. తను ఆశించిన సంబరం దాని ముఖంలో కనిపించ లేదు లచ్చికి. "ఏవే, గౌను బాగా లేదూ...?" అనడిగింది దిగులుగా. నాగరత్నం వెంటనే జవాబు చెప్ప లేదు. గౌను అందుకుని వొళ్ళో పెట్టుకుంటూ, తల్లి వేపు బేలగా చూస్తూ అడిగింది: "అది కాదే!... అమ్మా!... బువ్వ... బువ్వ తెస్తా నన్నావు కదే... బువ్వేదమ్మా! ...." అని!

లచ్చి నిర్ఘాంత పోయింది! తమ పేద బతుకులో మొదటి సారి, దిగజారిపోయినా, కూతురికి కావలసినది మాత్రం, యివ్వ లేకపోయింది! ఆ పిచ్చి తల్లి కోరికల్లోని ప్రాధాన్యతా క్రమాన్ని గుర్తించే శక్తి ఆమెకి లేక పోయింది! ఆమె ముఖంలో నెత్తురు తిరగబడింది.

బయట –

ఆగినట్టే ఆగి, కురుస్తూనే ఉంది – ఉదయం నుంచీ వాన!

* * *

*ఆంధ్ర సచిత్ర వార పత్రిక 26-1-1979 సంచికలో ప్రచురణ.*